విజేతలకు నగదు బహుమతితోపాటు ట్రోఫీని అందిస్తున్న శ్రీధర్‌రావు

క్రికెట్ పోటీల్లో విజేత స్టేషన్‌ఘన్‌పూర్

ద్వితీయ స్థానంలో నిలిచిన పల్లగుట్ట జట్టు

స్టేషన్ ఘన్‌పూర్, ఫిబ్రవరి 25 : చిల్పూరు మండలం పల్లగుట్టలో నిర్వహించిన క్రికెట్ పోటీలు ఆదివారం ముగిశాయి. ఈ నెల 4న ప్రారంభమైన క్రికెట్ పోటీలు 25వ తేదీ వరకూ కొనసాగాయి. 33టీమ్‌లు హాజరుకాగా, ఫైనల్ మ్యాచ్‌లో స్టేషన్‌ఘన్‌పూర్, పల్లగుట్ట టీమ్‌లు తలపడ్డాయి. స్టేషన్‌ఘన్‌పూర్ జట్టు విజేతగా నిలువగా, ద్వితీయ స్థానాన్ని పల్లగుట్ట టీమ్ కైవసం చేసుకుంది. తెలంగాణ ఉద్యమంలో పోరాడిన పొట్లపల్లి చక్రధర్‌రావు జ్ఞాపకార్థం వారి కుమారుడు బుగులు వెంకటేశ్వరస్వామి ఆలయ మాజీ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు, పల్లగుట్ట యూత్ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు నిర్వహించారు. రెండు క్రికెట్ కిట్లతోపాటు, టోర్నమెంట్స్‌లో ప్రథమ స్థానంలో నిలిచిన టీమ్‌కు రూ.25వేల నగదు బహుమతితోపాటు ట్రోఫీని శ్రీధర్‌రావు అందించారు. ద్వితీయ స్థానంలో నిలిచిన పల్లగుట్ట టీమ్‌కు సొసైటీ వైస్‌చైర్మన్ చిర్ర నాగరాజు రూ.10 వేల నగదు బహుమతి అందించారు. ఈ సందర్భంగా శ్రీధర్‌రావు మాట్లాడుతూ క్రీడలతో యువతలో క్రమశిక్షణ, స్నేహభావం పెంపొందుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్సై వినయ్‌కుమార్, రత్నాకర్‌రెడ్డి, యూత్ సభ్యులు దార రజినీకుమార్, ఇప్రం కృష్ణ, సతీశ్ రెడ్డి, రాజేశ్‌కన్నా, రాజుకుమార్, రమేశ్, సతీశ్, రణధీర్, గిరిబాబు, చింటూ, నిరంజన్, అనిల్, మధు, విష్ణు, భరత్, మేఘన్, అనూఫ్ పాల్గొన్నారు.

వీరభద్రస్వామి ఆలయానికి విరాళాలు

ఉత్సవ విగ్రహాలు అందించిన దాతలు

ఉత్సవ విగ్రహాలు

లింగాలఘనపురం, ఫిబ్రవరి 25 : మండల కేంద్రంలోని వీరన్నగుట్ట గుహలో వెలిసిన వీరభద్ర స్వామి ఆలయ అభివృద్ధికి విరాళాలు వెల్లువెత్తుతున్నాయి. శతాబ్దాల క్రితం నాటి ఆలయంలో మహాశివరాత్రి రోజున స్వామివారి కల్యాణంతో పాటు బోనాలు మొక్కుగా సమర్పిస్తారు. అయితే ఈసారి జాతర నిర్వహించాలని ఉత్సవ నిర్వాహకులు నిర్ణయించారు. ఈ క్రమంలో ఐదు రోజుల క్రితం ఆలయ అభివృద్ధి కమిటీని ఏర్పాటు చేశారు. లింగాలఘనపురానికి చెందిన రిటైర్డ్ ప్రొఫెసర్ కేమిడి ఐలయ్య ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉంటున్నారు. ఈ నేపథ్యంలో కేమిడి ఐలయ్య చాయాదేవి దంపతులతో పాటు వారి కూతురు శీలంపెల్లి శివాణి, అల్లుడు వేణుగోపాల్ రూ.41,116తో తయారు చేసిన వీరభద్రస్వామి, భద్రకాళీ అమ్మవారి ఉత్సవ విగ్రహాలను ఆదివారం ఆలయానికి అందించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ బాధ్యులు బండ సత్తయ్య, కేమిడి భిక్షపతి, ఏదునూరి వీరన్న, కేమిడి వెంకటేశ్, మల్గ శ్రీశైలం, డీజే నాగరాజు, కేమిడి నాగరాజు, కర్రె వీరన్న పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

దామెర, ఫిబ్రవరి 25 : మండలంలోని ఊరుగొండ సమీపంలో ట్రై సైకిలిస్టును తప్పించబోయి ఆర్టీసీ బస్సు డివైడర్‌ను ఢీకొట్టిన ఘటన ఆదివారం జరిగింది. భూపాలపల్లి డిపో బస్సు ములుగు రోడ్డు నుంచి గూడెప్పాడ్ వైపు వెళ్తున్నది. హనుమకొండ న్యూశాయంపేటకు చెందిన అచ్చునూరి ఐలయ్య ట్రై సైకిల్‌పై అదే మార్గంలో వెళ్తున్నాడు. సైకిలిస్టును తప్పించబోయిన ఆర్టీసీ బస్సు డివైడర్‌ను ఢీకొట్టింది. బస్సులో 15మంది ప్రయాణికులు ఉండగా, ఎవరికీ గాయాలు కాకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ట్రై సైకిలిస్టు కింద పడిపోగా చికిత్స కోసం వరంగల్‌కు తరలించారు.

ఆర్టీసీ ఆదాయం రూ.17.58 లక్షలు

జనగామ డిపో మేనేజర్ జ్యోత్స్న

మేడారం భక్తులకు సేవలందించిన ఆర్టీసీ సిబ్బంది

స్టేషన్ ఘన్‌పూర్, ఫిబ్రవరి 25 : వనదేవతలను దర్శించుకునేందుకు మేడారం వెళ్లే భక్తులకు స్టేషన్‌ఘన్‌పూర్ నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపడం ద్వారా రూ.17.58 లక్షల ఆదాయం లభించిందని జనగామ డిపో మేనేజర్ జ్యోత్స్న తెలిపారు. దీనికి సంబంధించిన వివరాలను ఆదివారం ఆమె వెల్లడించారు. ఈ నెల 19నుంచి స్టేషన్‌ఘన్‌పూర్ నుంచి మేడారం వరకు బస్సులు నడిపామని తెలిపారు. 161ట్రిప్పులు నడుపగా 2,827మంది మహిళలు, 2,545మంది పురుషులు, 518మంది పిల్లలతో కలిపి మొత్తం 5,890 మంది మేడారం వెళ్లారని జ్యోత్స్న వివరించారు. గత మేడారం జాతరకు 88ట్రిప్పులు నడుపగా రూ.14లక్షల వరకు ఆదాయం లభించిందన్నారు. మేడారానికి ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సుల ద్వారా 16మంది సిబ్బంది ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించారని ఆమె తెలిపారు.

అమ్మవార్ల జాతర ఆదాయం రూ.1.37 లక్షలు

తరిగొప్పుల, ఫిబ్రవరి 25: మండలంలోని బొంతగట్టునాగారం, బొత్తలపర్రె శివారులో జరిగిన ఏడు పోచమ్మల తల్లి, సమ్మక్క, సారలమ్మ జాతరలకు హుండీల ద్వారా లభించిన ఆదాయాన్ని ఉత్సవ కమిటీ సభ్యులు ఆదివారం లెక్కించారు. భక్తులు రూ.1,37,731 నగదు హుండీల్లో వేశారు. రూ.15వేల విలువైన వెండి లభించిందని ఉత్సవ కమిటీ బాధ్యులు విలేకరుల సమావేశంలో వెల్లడించారు. గత జాతర కంటే ఈసారి భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చారని వివరించారు. కార్యక్రమంలో జాతర కమిటీ చెర్మన్ సభావత్ రాజు, వైస్ చైర్మన్ నాం శ్రీనివాస్, ఎంపీటీసీ భూక్యా జూంలాల్‌నాయక్, మాజీ సర్పంచ్‌లు ఇరుమల్ల బాలమణి, భూక్యా కమల, నాయకులు భూక్యా రవి, ఇరుమల్ల రాజయ్య, కుర్ర మల్లయ్య పాల్గొన్నారు.

హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న కమిటీ సభ్యులు

పెద్దవంగరలో యూరియా కొరత

- అధిక ధరలతో పాటు ఇతర మందులు లింకు చేస్తున్న షాపుల నిర్వాహకులు
- పట్టించుకోని అధికారులు
- చర్యలు తీసుకోవాలని రైతుల వేడుకోలు

యూరియాను కొనుగోలు చేసి తీసుకెళ్తున్న రైతు

పెద్దవంగర, ఫిబ్రవరి 25: రైతులు ఆరుగాలం కష్టించి పండించే పంటలకు యూరియా కొరత ఏర్పడింది. ప్రస్తుత సీజన్‌లో ముఖ్యంగా వరి, మక్కజొన్న, మిరప పంటలకు యూరియా అధికంగా ఉపయోగపడుతుండడంతో మండల రైతులు యూరియా కొరతతో ఇబ్బందులు పడుతున్నారు. మండల వ్యాప్తంగా 20గ్రామాలుండగా, మూడు గ్రామాల్లో ప్రాథమిక వ్యవసాయ కేంద్రం (పీఏసీఎస్) సహాయంతో మూడు షాపులు, మండల కేంద్రంలో మన గ్రోమోర్‌తో పాటు మరో ఆరు షాపుల్లో ఎరువులను విక్రయిస్తున్నారు. అయినా మండల వ్యాప్తంగా రైతులకు యూరియా అందుబాటులో లేదు. కొన్ని షాపుల యజమానులు యూరియాను తీసుకొచ్చిన వెంటనే రైతులు బారులు కట్టడంతో ఇదే అదునుగా భావించి 45 కిలోల బస్తా రూ.266.50 విక్రయించాల్సి ఉన్నా, రూ.320 నుంచి రూ.350కి అమ్ముతూ, ఇతర మందులను తీసుకుంటేనే ఇస్తామని లింకు పెడుతున్నారు. రైతులపై మరో భారం మోపుతుండడంతో చేసేది ఏమిలేక అన్నదాతలు కొనుగోలు చేస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో షాపుల యజమానులు యూరియాను అధిక ధరలకు అమ్ముతూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదేమని ప్రశ్నించిన రైతులకు 'యూరియా ఇవ్వమని, ఎవరికి చెప్పుకుంటారో.. చెప్పుకోండి' అని షాపు నిర్వాహకులు పేర్కొంటున్నారు. దీంతో కొందరు రైతులు తొర్రూరు, తిరుమలగిరి, ఇతర ప్రాంతాలకు వెళ్లి యూరియాను కొనుగోలు చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రైతులకు యూరియా కొరత లేకుండా చూడాలని, అధిక ధరలకు విక్రయించకుండా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయంపై మండల వ్యవసాయ అధికారిని వివరణ కోరగా.. 'యూరియాను అధిక ధరలకు విక్రయిస్తున్నారని, లింకు పెడుతున్నారని మా దృష్టికి రాలేదని, వస్తే షాపు నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని' తెలిపారు.

గర్భాలయం వద్ద ఎమ్మెల్సీ సారయ్య దంపతులు

మల్లూరులో ఎమ్మెల్సీ సారయ్య పూజలు

మంగపేట, ఫిబ్రవరి 25 : మండలంలోని మల్లూరు హేమాచల లక్ష్మీ నర్సింహస్వామి దేవస్థానంలో ఆదివారం ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి దర్శనానికి వచ్చిన ఆయన ఆలయ సంప్రదాయం ప్రకారం అర్చక బృందం, చైర్మన్ నూతిలకంటి ముకుందం స్వాగతం పలికారు. అనంతరం గర్భాలయంలో నిర్వహించిన తైలాభిషేక పూజాక్రతవులో ఎమ్మెల్సీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారికి ఆశీర్వచనంతో పాటు తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేశారు. పూజా కార్యక్రమాల్లో ఆలయ కమిటీ సభ్యుడు శ్రీనివాసాచారి, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

వాగులో నుంచి రోహిత్‌లాల్ మృతదేహాన్ని తీసుకొస్తున్న పోలీసులు

జంపన్నవాగులో భక్తుడి మృతి

తాడ్వాయి, ఫిబ్రవరి 25 : వనదేవతల దర్శనానికి వచ్చిన భక్తుడు జంపన్నవాగులోకి దిగి గల్లంతై మృతి చెందాడు. ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని మలక్‌పేటకు చెందిన రోహిత్‌లాల్ (21) కుటుంబంతో కలిసి శనివారం అమ్మవార్ల దర్శనానికి వచ్చాడు. తన బావమరిది యశ్వంత్‌తో కలిసి చిలుకలగుట్ట వెనుక భాగాన సుమారు 5 కిలోమీటర్ల దూరంలోని మాటేరుతోగె వద్ద స్నానం చేసేందుకు వాగులోకి దిగాడు. లోతు ఎక్కువగా ఉండడంతో రోహిత్‌లాల్ నీళ్లలో మునిగిపోయాడు. వెంటనే యశ్వంత్ కుటుంబ సభ్యులకు సమాచారమందించగా వారు ఎస్సై శ్రీకాంత్‌రెడ్డికి తెలిపారు. రాత్రి కావడంతో వెళ్లలేకపోయిన పోలీసులు ఆదివారం ఉదయం ఘటనా స్థలికి వెళ్లి రోహిత్‌లాల్ మృతదేహాన్ని గుర్తించారు. అక్కడి నుంచి ఎస్సైతో పాటు సిబ్బంది మృతదేహాన్ని మోసుకుని వచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సన్నూరులో శ్రీవారికి ప్రత్యేక పూజలు

దేవరాజ వాహనంపై స్వామివారిని తీసుకొస్తున్న భక్తులు

రాయపర్తి, ఫిబ్రవరి 25: మండలంలోని వేంకటేశ్వరపల్లిలో చారిత్రక స్వయం వ్యక్త శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం (సన్నూరు)లో నిర్వహిస్తున్న స్వామివారి వార్షిక అధ్యయన బ్రహోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీదేవి, భూదేవితో శనివారం రాత్రి శ్రీవారి తిరుకల్యాణోత్సవం – తలంబ్రాలు నిర్వహించిన నేపథ్యంలో ఆదివారం పరిణయ పట్టు వస్త్రాల్లో ఉన్న సతీసమేత శ్రీవారికి ఆలయ అనువంశిక ధర్మకర్తల మండలి, ఆలయ అనువంశిక పూజారులు, ఉత్సవ కమిటీల సారథ్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సతీ సమేత శ్రీనివాసుడు దేవరాజవాహనం, గరుడ వాహనాలపై మంగళవాయిద్యాలు, మంగళహారతులు, భక్తుల జయజయ ధ్వానాల నడుమ వేంకటేశ్వరపల్లి, ఆలయ పరిసరాల్లో ఊరేగడంతో గ్రామ పరిసరాలు గోవింద నామస్మరణతో మార్మోగుతున్నాయి.

'అగ్రం పహాడ్' హుండీల తరలింపు

హుండీలను తరలిస్తున్న ఆర్డీవో శ్రీనివాస్

ఆత్మకూరు, ఫిబ్రవరి 25 : అగ్రంపహాడ్ సమ్మక్క–సారలమ్మ దేవతల వద్ద ఏర్పాటు చేసిన 50 హుండీలను పరకాల ఆర్డీవో శ్రీనివాస్, తహసీల్దార్ జగన్‌మోహన్ రెడ్డి, ఈవో శేషగిరి, జాతర కమిటీ చైర్మన్ శీలం రమేశ్ సమక్షంలో వరంగల్ బట్టల బజార్‌లోని వేంకటేశ్వర్ స్వామి ఆలయానికి తరలించారు. పోలీసుల బందోబస్తు నడుమ హుండీలను తరలించినట్లు ఈవో తెలిపారు. అలాగే, అగ్రంపహాడ్ సమ్మక్క–సారలమ్మ దేవతలను భక్తులు దర్శించుకున్నారు. తల్లులు వన ప్రవేశం చిసిప్పటికీ భక్తులు భారీగా తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఇప్పటి వరకు 25 లక్షల మంది భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారని ఎండోమెంట్ అధికారులు తెలిపారు.

ఐనవోలు మల్లన్న ఆలయంలో భక్తుల సందడి

ఆలయ ఆవరణలో పట్నం వేస్తున్న భక్తులు

ఐనవోలు, ఫిబ్రవరి 25: ఐనవోలు మల్లికార్జునస్వామి ఆలయం భక్తులతో సందడిగా మారింది. ఆదివారం వారంతపు జాతరకు భక్తులు వివిధ జిల్లాల నుంచి వేలాదిగా తరలి వచ్చారు. ఒగ్గు పూజారులు స్వామివారికి మేలుకొలుపు తర్వాత శైవాగుమ పద్ధతిలో అర్చకులు విశేష అభిషేకాలు, కల్యాణం నిర్వహించి, రుద్రాభిషేకాలు చేశారు. భక్తులు ఆలయ ప్రాంగణంలో విడిది చేసి పట్నాలు వేసి బోనం వండి స్వామివారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు. మొక్కుల్లో భాగంగా స్వామి అమ్మవార్లకు భక్తులు ఒడిబియ్యం, వస్త్రాలు, ముత్తైదు సామగ్రిని ముట్టజెప్పారు. మరికొందరు స్వామివారికి రథసేవ చేశారు. వారాంతపు జాతరలో స్వామివారికి అభిషేకాలు, కల్యాణ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బొడ్రాయి వద్ద పూజలు చేస్తున్న ఎంపీ కవిత,

పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే మురళీనాయక్, మాజీ ఎమ్మెలే శంకర్‌నాయక్ దంపతులు

బొడ్రాయికి ప్రత్యేక పూజలు

- కుంబాభిషేకం, హోమం చేసి, బోనాల చెల్లింపు
- ముఖ్య అతిథిగా హాజరై పూజలు చేసిన ఎంపీ కవిత

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 25: మహబూబాబాద్ పట్టణంలోని వేణుగోపాలస్వామి ఆలయ సమీపంలో ఏర్పాటు చేసిన బొడ్రాయి (గ్రామ దేవత) ప్రథమ వార్షికోత్సవాలను రెండో రోజూ ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం నుంచే ప్రత్యేక పూజలు ప్రారంభించారు. గ్రామ దేవతకు ప్రత్యేకంగా గణేశ హోమం, రుద్ర హోమం నిర్వహించారు. దుర్గాదేవి హోమానికి ఎంపీ మాలోత్ కవిత హాజరై ప్రత్యేక పూజలు చేశారు. పట్టణవాసులు సుఖ సంతోషాలతో ఉండాలని, ఆయురారోగ్యాలు కల్పించాలని దేవుణ్ణి వేడుకొని బోనం చెల్లించారు. కుంబాభిషేకం, పంచ బోనాలకు పాత బజార్‌లో రామచంద్రాపురం కాలనీ, హౌసింగ్‌బోర్డ్ కాలనీ వాసులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. పూజారులు పూర్ణాహుతి, మహాదాశీర్వచనం, బోనాలు సర్పమించారు. మధ్యాహ్నం మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మురళీ నాయక్ దంపతులు, మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ –సీతామహాలక్ష్మి దంపతులు బోనాలు చెల్లించి, ప్రత్యేక హోమ పూజలు చేశారు. మున్సిపల్ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి, వార్డు కౌన్సిలర్లు, బొడ్రాయి కమిటీ సభ్యులు, వివిధ పార్టీల నాయకులు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

దేవాలయ కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఆలయ ట్రస్టు చైర్మన్ ఎర్రబెల్లి దయాకర్‌రావు

పర్వతాల శివాలయం ఉత్సవాలను జయప్రదం చేయాలి

మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

పర్వతగిరి, ఫిబ్రవరి 25: మండల కేంద్రంలోని పర్వతాల శివాలయ వార్షికోత్సవాలను జయప్రదం చేయాలని మాజీ మంత్రి, పర్వతాల శివాలయం ట్రస్ట్ చైర్మన్ ఎర్రబెల్లి దయాకర్‌రావు తెలిపారు. ఆదివారం పర్వతాల శివాలయాన్ని దర్శించుకుని మాట్లాడారు. శివరాత్రి ఉత్సవాల్లో భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని దేవాలయ కమిటీ సభ్యులకు సూచించారు. మండలంలోని ప్రజలందరూ హాజరు కావాలని కోరారు. మార్చి 7న తాడు గుంజుడు పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.40 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.30, తృతీయ బహుమతిగా రూ.20వేలు, నాలుగో బహుమతిగా రూ.10వేలు ఇవ్వనున్నట్లు ప్రకటించారు. గ్రామాలవారీగా పది మంది జట్టు సభ్యులుగా ఉంటారని చెప్పారు. మార్చి 8న శివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని నిర్వహించే ఈ పోటీలను విజయవంతం చేయాలని కోరుతూ కరపత్రాన్ని ఆవిష్కరించారు. వేడుకలను పురస్కరించుకుని శివాలయ ప్రాంగణంలో సామూహిక అభిషేకాలు, ఏకాదశ రుద్రాభిషేకం, శివపార్వతుల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాడుగుల రాజు, మాజీ ఉపసర్పంచ్ రంగు జనార్ధన్‌గౌడ్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు రంగు కుమార్, సంపెల్లి వేంకటేశ్వర్‌రావు, కొమురయ్య, ఆలయ సిబ్బంది అశోక్, పుష్ప, భాస్కర్ పాల్గొన్నారు.

ఎర్రబెల్లిలో హుండీ ఆదాయం లెక్కింపు

వేలేరు, ఫిబ్రవరి 25 : మండలంలోని ఎర్రబెల్లి సమ్మక్క–సారలమ్మ జాతర హుండీ ఆదాయాన్ని ఆదివారం జాతర నిర్వాహకులు లెక్కించారు. నిర్వాహకుడు కాలేరు చినబాబు ఆధ్వర్యంలో హుండీలను లెక్కించగా, రూ.77,878 ఆదాయం సమకూరినట్లు తెలిపారు.

నేటి ప్రజావాణి రద్దు

కలెక్టర్ రిజ్వాన్‌బాషా

జనగామరూరల్, ఫిబ్రవరి 25 : జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించే ప్రజావాణిని రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్‌బాషా తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. త్వరలో పార్లమెంటు ఎన్నికలకు నోటిఫికేషన్ వెలువడనున్న నేపథ్యంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల ఎన్నికల అధికారులకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమం ఉందన్నారు. అధికారులు అందుబాటులో ఉండడం లేదని, అందుకే ప్రజావాణిని రద్దు చేసినట్లు ఆయన వెల్లడించారు. అందువల్ల వివిధ సమస్యలపై వినతిపత్రాలిచ్చే వారు కలెక్టరేట్ కార్యాలయానికి రావొద్దని సూచించారు.

ముగిసిన మడేలేశ్వరస్వామి వేడుకలు

బచ్చన్నపేట, ఫిబ్రవరి 25 : రజక సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నిర్వహించిన మడేలేశ్వరస్వామి ప్రతిష్ఠాపన ఉత్సవాలు కనుల పండువగా జరిగాయి. శనివారం రాత్రి స్వామివారి కల్యాణం నిర్వహించగా ఆదివారం రజక కుటుంబాలు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించారు. అనంతరం మేకలు, కోళ్లు బలిచ్చి వనభోజనాలకు తరలివెళ్లారు. రజక సంఘం అధ్యక్షుడు పెనుబెల్లి వెంకటేశ్వర్లు, సభ్యులు దేవరకొండ రమేశ్, పోచంపల్లి శ్రీనివాస్, కుల పెద్ద మినలాపురం చెన్నయ్య ఆధ్వర్యంలో ఉత్సవాలు ప్రశాంతంగా జరిగాయి. ప్రతి ఇళ్లూ బంధుగణంతో సందడి నెలకొంది. కొత్త వస్త్రాలు ధరించి కొబ్బరికాయలు కొట్టి చల్లంగ చూడు స్వామి అని వేడుకున్నారు. ఉత్సవాల విజయవంతానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

స్టేషన్‌ఘన్‌పూర్ సీఐకి సన్మానం

స్టేషన్ ఘన్‌పూర్, ఫిబ్రవరి 25 : ఇటీవల రామగుండం నుంచి బదిలీపై వచ్చి స్టేషన్ ఘన్‌పూర్ సీఐగా బాధ్యతలు చేపట్టిన ముస్కు రాజును బీజేపీ నాయకులు సత్కరించారు. ఆదివారం ఆ పార్టీ మండల అధ్యక్షుడు సట్ల వెంకటరమణ నాయకులతో కలిసి సీఐ రాజును శాలువాతో సన్మానించారు. ఎస్సీసెల్ జిల్లా కార్యదర్శి రడపాక ప్రదీప్, మండల ఉపాధ్యక్షుడు చట్ల రాజు, బూత్ అధ్యక్షుడు సతీశ్ పాల్గొన్నారు.

చాదర్‌ను తీసుకెళ్తున్న వైస్ ఎంపీపీ చల్లా సుధీర్‌రెడ్డి

తాటికొండలో భక్తిశ్రద్ధలతో ఉర్సు

స్టేషన్ ఘన్‌పూర్, ఫిబ్రవరి 25 : మండలంలోని తాటికొండలో ముస్లింలు భక్తిశ్రద్ధలతో ఆదివారం ఉర్సు ఉత్సవాలు నిర్వహించారు. గ్రామంలోని గడీలో దర్గా షరీఫ్ హజరత్ రహల్లా హుసేని, రహమతుల్లా అలై ఉర్సును మత పెద్దలు ఘనంగా కొనసాగించారు. ముఖ్యఅతిథిగా మండల వైస్ ఎంపీపీ చల్లా సుధీర్‌రెడ్డి హాజరై చాదర్‌ను అందించారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ అన్ని మతాల పండుగలను అందరూ గౌరవించుకుంటూ కుల మతాలకు అతీతంగా కలిసి మెలిసి ఉండాలని కోరారు. కార్యక్రమంలో దర్గా పీఠాధిపతి కుర్బన్ అలీ మహ్మద్, కమిటీ సభ్యులు ఎండీ అబ్బాస్, మోసిన్‌అలీ మహ్మద్, ఆజం మహ్మద్, అరాఫత్ పాల్గొన్నారు.



మృతుడి కుటుంబానికి చెక్కు అందిస్తున్న వెంకటేశ్వర్లు

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

పాలకుర్తి, ఫిబ్రవరి 25: మండలంలోని దర్దేపల్లికి చెందిన కల్లుగీత కార్మికుడు గిరగాని యాకయ్య ఇటీవల తాటిచెట్టుపై నుంచి పడి మృతి చెందాడు. మృతుడి కుటుంబానికి టాడీ కార్పొరేషన్ నుంచి రూ.25వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ మేరకు మృతుడి సతీమణి గిరగాని వరలక్ష్మికి గౌడ జనహక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూల వెంకటేశ్వర్లు ఆదివారం చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్ర వెంకటేశం, గౌడ జనహక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు యెలికట్టె విజయ్‌కుమార్ సహకారంతో రూ.25 వేలు మంజూరయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గిరగాని సమ్మయ్య, కమ్మగాని పరమేశ్వర్, పొడిశెట్టి వెంకన్న, తాళ్లపల్లి కుమారస్వామి, గిరిగాని సుధాకర్, గిరగాని నాగన్న పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

jobs Apply Now!

★Wanted PRO's for Degree and Junior College Admissions (20 years Experience) Cont: **8121554649, 9391660036.** NTW-323172

★Urgent Requirement for ICIC, HDFC, AXIS, INDUSIND Bank's Loans. Need Exp. & Fresher Female Tele-Callers, Sal+Inc. etc., Job Location: HNK, Cont: **+91 8712312528.** NTW-5693

★**హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను,** పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్: 6K. Ph: 9640468899 / 9640258899. NT-319443

★**హైదరాబాద్‌లో అర్జెంటుగా కొండాపూర్‌కి** సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. మంచి జీతం, భోజనం, వసతి కలదు. సంప్ర: 9392663777, 9246663777, 9290003999. NT-313897

FINANCIAL SERVICES

★**రుణాలు, వ్యక్తిగత, వ్యవసాయ, వ్యాపార** రుణం, అతి తక్కువ వడ్డీ రేటుతో, సిబిల్ అవసరం లేదు! NPA కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఏజెంట్స్ కావలెను. నొవా ఫైనాన్స్. ఫోన్: 7696660523. NT-311956

PLOT FOR SALE

★2 ఎకరాల 23 గుంటల వ్యవసాయ భూమి అమ్మకానికి కలదు. రామప్ప గుడికి 1.5 kms సమీపంలో, వెంకటాపూర్, ములుగు (D), వరంగల్. సంప్ర: 8686589800. NTW-323173

★**హయత్ నగర్, పెద్ద అంబర్‌పేట్, కోహెడ,** బాటసింగారం, శ్రీమిత్ర, జనవైతన్య, మౌంట్ ఒపేర, గ్రీన్ సిటీ, సుచిరిండియాలో ప్లాట్లు కొనబడును. నో Brokrs. 9553973999 / 6303049720. NT-313892

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్

★ సెప్టిక్ ట్యాంక్ క్లీనర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043, 9866584455. NTW-323107

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే

4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే

ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే

ప్రకటనల విభాగం : 9182777552

HANAMKONDA 9182777563